## విలేకరులు కావలెను

**మనవార్త దినపత్రిక లో పనిచేయుటకు విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారీగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

Cell:9618110034, 8309605189



TITLE Code TEL TEL12230

# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA





హైదరాబాద్,కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల    బుధవారం 22 మే 2024    పేజీలు : 4 వెల : రూ.2


## ఇరాన్ తాత్కాలిక అధ్యక్షుడుగా మొఖ్బర్



ఇరాన్ తాత్కాలిక అధ్యక్షుడిగా మొహమ్మద్ మొఖ్బర్ నియమితులయ్యారు. ఆదివారం జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మృతి చెందడంతో ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా ఉన్న మొఖ్బర్‌కు అలీ ఖమేనీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. రైసీ మృతికి సంతాప సందేశంలో మొఖ్బర్ నియామకాన్ని ప్రకటించారు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం సిట్టింగ్ ప్రెసిడెంట్ మరణం తర్వాత మొదటి వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ మొఖ్బర్(69)కు అవకాశం దక్కింది. తాత్కాలిక హోదాలో ఈ అధ్యక్ష పదవిని చేపట్టారు. మరో 50 రోజుల్లో శాశ్వత అధ్యక్షుడి నియామకం జరుగుతుంది. మొఖ్బర్ గతంలో సెటాడ్ అనే శక్తివంతమైన ప్రభుత్వ యాజమాన్యంలోని ఫౌండేషన్‌కు నాయకత్వం వహించారు. అంతర్జాతీయ చట్టం మరియు నిర్వహణలో అధునాతన డిగ్రీలను కలిగి ఉన్నారు.

## నాలుగోసారి బలపరీక్ష నెగ్గిన ప్రధాని



నేపాల్ ప్రధాని పుష్ప కమాల్ దహాల్ ప్రచండ పార్లమెంట్‌లో జరిగిన విశ్వాస పరీక్షలో నెగ్గారు. హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ నుంచి ఆయన బలపరీక్షలో పాల్గొన్నారు. ప్రతిపక్ష నేపాలీ కాంగ్రెస్ ఓటింగ్‌ను బహిష్కరించింది. అయినా ప్రచండ మాత్రం తన బలాన్ని నిరూపించుకున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 100 క్లాజ్ 2 ప్రకారం ప్రచండ విశ్వాస పరీక్షలో పాల్గొన్నారు. కూటమి సర్కారు నుంచి జనతా సమాజ్‌బాదీ పార్టీ వైదొలగడంతో ప్రచండ విశ్వాస పరీక్షకు అనివార్యమైంది. కోఆపరేటివ్ నిధుల్లో అక్రమాలకు పాల్పడినట్టు హెూంమంత్రి రాబి లబిచానేకు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు నినాదాలు చేశాయి. ఒకవేళ కూటమి సర్కారులో చీలికలు వస్తే, అప్పుడు ప్రధాని 30 రోజుల తేడాలోనే విశ్వాస పరీక్షలో పాల్గొనాల్సి ఉంటుంది. గత ఏడాదిన్నర కాలంలో ప్రచండ బలపరీక్షలో పాల్గొనడం ఇది నాలుగవసారి. 275 మంది ఉన్న హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో 138 ఓట్లు అనుకూలంగా పోల్ కావాల్సి ఉంటుంది. అయితే ఇవాళ జరిగిన బలపరీక్షలో ఆయనకు 157 ఓట్లు పడ్డాయి.

## 10 యూనివర్సిటీలకు ఇన్‌ఛార్జ్ వీసీల నియామకం..

హైదరాబాద్ **మన వార్త** : రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం మంగళవారం కీలక ప్రకటన చేసింది.




రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలకు ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంచార్జ్ వీసీలుగా సీనియర్ ఐఏఎస్ అధికారుల పేర్లను ప్రభుత్వం ప్రకటించింది. కొత్త వీసీలు నియమితులయ్యేంత వరకూ వీరే బాధ్యతల్లో కొనసాగనున్నారు. యూనివర్సిటీల ఇన్‌ఛార్జ్ వీసీల జాబితా..ఉస్మానియా వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా దాన కిషోర్,జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీగా బుర్ర వెంకటేశం,తెలుగువర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా శైలజారామయ్యర్,అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా రిజ్వి,కాకతీయ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా వాకాటి కరుణ,తెలంగాణవర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా సందీప్ సుల్తానియా,మహాత్మాగాంధీ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా నవీన్‌మిట్టల్,శాతవాహన వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా సురేంద్రమోహన్,వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా జయేష్ రంజన్,పాలమూరు వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా నదీమ్ అహ్మద్ 10 యూనివర్సిటీల వీసీల పదవీకాలం ఇవాల్టితో ముగియడంతో ప్రభుత్వంలో వివిధ శాఖాధిపతులుగా పనిచేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటికే కొత్త వీసీల కోసం అన్ని వర్శిటీలలో సెర్చ్ కమిటీలు ఏర్పాటయ్యాయి. జాబితాలను పరిశీలించిన తర్వాత ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోనుంది. అప్పటివరకు ఇన్‌ఛార్జి వీసీలుగా ఐఏఎస్ అధికారులు బాధ్యతల్లో కొనసాగనున్నారు.

## 2 లక్షల ఉద్యోగాల మాటే లేదు

**– కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్**



నల్లగొండ : నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. 2 లక్షల ఉద్యోగాల మాటే లేదు.. నిరుద్యోగ భృతి ఊసే లేదు అని కేటీఆర్ మండిపడ్డారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఖమ్మం – వరంగల్ – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మద్దతుగా కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఖమ్మం – నల్లగొండ – వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో 4 లక్షల 70 వేల మంది పట్టభద్రులు ఉన్నారు. మరి అరచేతిలో వైంకుఠం చూపెట్టి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఓటేద్దామా..? పదేండ్ల పాటు నిజాయితీగా పని చేసిన బీఆర్ఎస్‌కు ఓటెద్దామా..? ఒక గోల్డ్ మెడల్ సాధించి ప్రజాసేవకు అంకితమైన రాకేశ్ రెడ్డికి ఓటేద్దామా..? మీడియా, యూట్యూబ్ అడ్డం పెట్టుకుని దందాలు చేసే చీటర్లకు ఓటేద్దామా..? అనేది ఆలోచించాలని పట్టభద్రులకు కేటీఆర్ సూచించారు.

# తెలంగాణలో తగ్గనున్న జిల్లాలు.?

- 17 జిల్లాలా... 22 జిల్లాలా...
- అంశంపై సీనియర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ చర్చలు
- 33 జిల్లాలకు ఎదురవుతున్న నిధుల సమస్య
- ఎన్నికల కోడ్ ముగియగానే జిల్లాల కుదింపు ప్రక్రియ ప్రారంభమవుతుందంటున్న కాంగ్రెస్ నేతలు




హైదరాబాద్ **మన వార్త** : ఎన్నికల కోడ్ ముగుస్తుండడంతో పాలనపై దృష్టి సారించిన సీఎం రేవంత్ రెడ్డి, ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నారు. తమ ప్రభుత్వం రాగానే తెలంగాణలో జిల్లాల సంఖ్య తగ్గిస్తానని గతంలో హామీ ఇచ్చిన ఆయన, ఇప్పుడు ఇదే అంశంపై సీనియర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చించి ఓ నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. గతంలో కేసీఆర్ పరిపాలనా సౌలభ్యం కోసం ఉమ్మడి 10 జిల్లాల సంఖ్యను 33 జిల్లాలుగా మార్చారు. అయితే, ఈ విభజన శాస్త్రీయంగా జరగలేదని అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ఆరోపిస్తూ వచ్చింది. కొన్ని ప్రాంతాలలో ఒక్కో జిల్లాను 5 ముక్కలుగా చేయడంతో పాలనా పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు సైతం మొత్తుకున్నారు. అందుకు సంబంధించి అప్పటి కేసీఆర్ సర్కార్‌కు నివేదికలు సైతం అందజేశారు. అయితే, గత ప్రభుత్వ కాలంలో పనిచేసిన కొందరు పెద్దలు కేసీఆర్‌ను తప్పుదోవ పట్టించారని, వాళ్ల డిమాండ్‌కు తలొగ్గిన కేసీఆర్ తీసుకున్న తొందరపాటు నిర్ణయమే దీనికి కారణంగా కొందరు బాహాటంగానే విమర్శించారు. 33 జిల్లాలకు సంబంధించి నిధుల సమస్య కూడా ఎదురవుతోందని ప్రస్తుత ఉన్నతాధికారులు సీఎం రేవంత్ రెడ్డికి ఇప్పటికే నివేదికలు అందించారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు జిల్లాల పునర్వవస్థీకరణపై ఓ కమిషన్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇప్పటికే ఈ విషయమై రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారని సమాచారం. ఎన్నికల కోడ్ ముగియగానే యుద్ధ ప్రాతిపదికన జిల్లాల కుదింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు. ఉమ్మడి ఏపీ నియోజకవర్గాల పునర్విభజన టైమ్‌లో అప్పటి సర్కార్ ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఇప్పుడు కూడా అదే తరహాలో ఉన్నతాధికారులతో తెలంగాణలోనూ జ్యూడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ కమిటీ ఇచ్చే గైడెన్స్ మేరకు జిల్లాల విభజనపై నిర్ణయం తీసుకోవాలని సీఎం భావిస్తున్నారు. జిల్లాల విషయంలో తమ ప్రభుత్వ ఆలోచనను అసెంబ్లీలో ప్రతిపాదించి సభ్యులతో చర్చించి అనంతరం కుదింపుపై నిర్ణయం తీసుకోవాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పార్లమెంట్ నియోజకవర్గాలు 17. వాటికి డీలిమిటేషన్ ప్రకారం చూస్తే 1/3 జిల్లాలు పెరుగుతాయి. ఆ లెక్కన 17+6 =23 జిల్లాలు అవుతాయి.జనాభా లెక్కల ప్రకారం చేస్తే 22 జిల్లాలు అయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. జ్యుడీషియల్ కమిషన్ నివేదికతో పాటు నిధులకు అనుకూలంగా ఉండేలా చివరకు 22 లేదా 23 జిల్లాలను ప్రభుత్వం ఫైనల్ చేసే అవకాశం ఉందని భావిస్తున్నాయి. కొందరు అధికారులు మాత్రం పార్లమెంట్ నియోజకవర్గాలు 17 ఉండగా దానికి అనుగుణంగా, 17 జిల్లాలను చేయాలని దానివల్ల నిధులకు, ఖర్చుకు కూడా ఇబ్బందులు ఉండవని పేర్కొంటుండగా జ్యుడీషియల్ నివేదికనే ఫైనల్ అని ప్రభుత్వం పేర్కొంటున్నట్టుగా తెలిసింది. రానున్న రోజుల్లో ఒకవేళ 17 జిల్లాలు చేస్తే గొడవలు జరిగే అవకాశం ఉందని, రాజకీయంగా పార్టీలకు నష్టం జరిగే అవకాశం ఉందని కూడా ఆ వర్గాలు పేర్కొంటుండడం విశేషం.

## ఇన్ని ఫిర్యాదులు చేసినా చర్యలేవీ ?

### ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు మరో లేఖ



న్యూఢిల్లీ **మన వార్త** : ప్రధాని నరేంద్ర మోడీ, ఇతర బిజెపి నేతలు పదేపదే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు ఫిర్యాదు చేస్తూ సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆదివారం ఒక లేఖ రాశారు. ఈ ఉల్లంఘనలకు సంబంధించి గతంలో అనేక ఫిర్యాదులు చేసినా ఎన్నికల కమిషన్ మౌనం పాటించడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.బిజెపి నేతలు పలువురు ఎన్నికల కోడ్‌ను పదే పదే ఉల్లంఘిస్తున్న అంశాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు., బిజెపి నేతలు చెబుతున్న అసత్యాలు, కట్టు కథలు, విద్వేషాలు రెచ్చగొట్టడం వంటి వాటి గురించి లేవనెత్తామని ఏచూరి ఆ లేఖలో గుర్తు చేశారు. దురదృష్టవశాత్తూ, వీటిల్లో ఏ ఒక్కదానిపైనా ఎన్నికల కమిషన్ స్పందించలేదని, దోషులను శిక్షించలేదని ఏచూరి పేర్కొన్నారు. ఈ రుగ్మతను మొగ్గలోనే తుంచేసేలా తక్షణమే దోషులపై చర్యలు తీసుకోవాలని చెప్పినా ఇసి మౌనం వహించిందని ఏచూరి విమర్శించారు. దీనిని అలుసుగా తీసుకుని బిజెపి నేతలు మరింతగా రెచ్చిపోతున్నారు. తాజాగా ఈ నెల 16న యుపిలోని బారాబంకీలో ఎన్నికల ర్యాలీలో ప్రధాని ప్రసంగిస్తూ, "సమాజ్‌వాదీ, కాంగ్రెస్‌లు అధికారంలోకి వస్తే, తిరిగి రామాలయాన్ని బుల్డోజరుతో ధ్వంసం చేస్తారని" నిర్లజ్జగా మాట్లాడారు.సర్నాలో ఈ నెల 17న ఎన్నికల ర్యాలీలో యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ, "కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాల్లో భాగమే ఇది. కేవలం ముస్లింలకు లబ్ధి చేకూరేలా మతం ప్రాతిపదికన వారు రిజర్వేషన్లు కల్పించాలని భావిస్తున్నారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల కోటాలను దోచేసి, వాటిని ముస్లింలకు అందజేయాలని కాంగ్రెస్, ఆర్‌జెడిలులు ప్రయత్నిస్తున్నాయి." అని ఆరోపించారు. సివాన్‌లోని రఘునాథ్‌పూర్‌లో ఎన్నికల సభలో ఈ నెల 18న అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ మాట్లాడుతూ, ఎన్‌డిఎ తిరిగి అధికారంలోకి వస్తే యుసిసిని తీసుకువచ్చి, ఇలా నాలుగుసార్లు పెళ్లిళు చేసుకోవడానికి స్వస్తి చెబుతుందన్నారు. మదరసాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ, ముల్లాలను ఉత్పత్తి చేసే దుకాణాలను కూడా మూసేస్తామని చెప్పారు.

## వరికి బోనస్ ఇవ్వకుంటే బాక్స్ బద్దలవడం ఖాయం



హైదరాబాద్ **మన వార్త** : తెలంగాణ ప్రభుత్వ తీరును బీజేపీ నేత బూర నర్సయ్య గౌడ్ తప్పు పట్టారు. వరికి బోనస్ ప్రకటన గురించి ప్రధానంగా ప్రస్తావించారు. సన్నం వడ్లకే బోనస్ ఇస్తామనడం సరికాదని అభిప్రాయ పడ్డారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని సూచించారు. లేదంటే బాక్స్ బద్దలవడం ఖాయమని హెచ్చరించారు. రైతులతోపాటు విద్యార్థులను తెలంగాణ ప్రభుత్వం మోసం చేసిందని బూర నర్సయ్య మండిపడ్డారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయి ఎందుకు విడుదల చేయడం లేదని అడిగారు. కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు రూ.4 వేల కోట్లు ఉంటాయ్.. ఫీజు రీయింబర్స్ మెంట్ మాత్రం చెల్లించరని మండిపడ్డారు. పేదలకు చేసిన చికిత్సకు సంబంధించి రూ.1400 కోట్ల ఆరోగ్య శ్రీ బకాయి కూడా పెండింగ్‌లో ఉందని ధ్వజమెత్తారు. ఉద్యోగుల డీఏను విడుదల చేయాలని పీఆర్సీ ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బూర నర్సయ్య గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ మరచిపోయారని విమర్శించారు. చేస్తానని చెప్పిన పనులను వెంటనే చేపట్టాలని కోరారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పు పట్టారు.

# అన్నపూర్ణ ఆర్యవైశ్య సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతము ఏర్పాటు




**ఇల్లంతకుంట, మే21( మన వార్త ప్రతినిది )**

కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో అన్నపూర్ణ ఆర్యవైశ్య సేవా సంస్థాన్ వారు మాట్లాడుతూ సత్రంలో శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి వ్రతము ఏర్పాటు చేశామని, ఈ సందర్భంగా శుద్ధ పౌర్ణమికి మొదటి నెల 23.5.2024 నాడు ఉదయం 10-00గం.లకు ప్రారంభం చేసుకునే భక్తులకు ఒక నెలకి 816/- రూపాయలు నగదు చెల్లించి రసీదు తీసుకున్న వారికి వ్రతానికి సంబంధించిన పూజా సామాగ్రి పసుపు కుంకుమ, రెండు టెంకాయలు రెండు జాకెట్ ముక్కలు మండపం మీద పోయడానికి బియ్యం, పోకలు , వక్కలు ,పూలు కుడకలు, అరటిపండ్లు తమలపాకులు, సత్యనారాయణ స్వామి ప్రసాదము సత్యనారాయణ స్వామి ఫోటో కానీ డాలర్ కానీ సంస్థ నుంచి కమిటీ వారు సమకూరుస్తారని అన్నారు. వ్రతము చేసుకునే వారు హారతి ప్లేట్ సెట్ ఎవరిది వారే ఇంటివద్ద నుండితెచ్చుకోగలరు ఇంకేమన్నా విశేషంగా కావాలి అనుకున్నచో వారు సొంతంగా సమకూర్చుకోగలరు సత్యనారాయణ వ్రతము అనంతరం భక్తులకు భోజన ఏర్పాట్లు చేశామని తెలిపారు. అదేవిధంగా సంవత్సరానికి ప్రతినెలా శుద్ధ పౌర్ణమికి సత్రములో వ్రతము నిర్వహించబడును కావున భక్తులు సంవత్సరానికి సరిపడా ఒకేసారి 9,000 చెల్లించి కూడా రసీదు పొందగలరు అన్నారు. ప్రతి ఒక్కరు తప్పకుండా సమయపాలన పాటించగలరు అన్నారు. ఆర్యవైశ్యులకు మాత్రమే అన్నారు. సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు ఆఫీస్ ఫోన్ నెంబర్ :-9618270100 క్యాషియర్ ఫోన్ నెంబర్ -:9959029041 లకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట అన్నపూర్ణ ఆర్యవైశ్య సేవా సంస్థాన్ కమిటీ సభ్యులు, వైశ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# పాఠశాలలను సందర్శించిన జిల్లా విద్యాధికారి ...



**జమ్మికుంట, మే 21( మన వార్త ప్రతినిధి):**

జమ్మికుంట పట్టణ పరిధిలోని చర్చి కాలనీ ప్రాథమిక పాఠశాల, ఆబాది జమ్మికుంటలో గల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాధికారి సి హెచ్. వి .ఎస్ జనార్ధన రావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ సాంక్షన్ అయినటువంటి పనులలో కరెంటు, నీటి వసతి, రిపేర్లు, టాయిలెట్ పనులు అన్నీ కూడా ఏకకాలంలో ప్రారంభించాలని తెలిపారు .వీటికి సంబంధించిన నిధులను సంబంధించిన అసిస్టెంట్ ఇంజనీర్ వెంటవెంటనే ఎంబీ రికార్డ్ చేసినచో మిగతా డబ్బులు మంజూరు అవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ జమ్మికుంట మండలంలోని అర్బన్ మరియు రూరల్ పాఠశాలలో జరిగిన పని వివరాలను వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సదానందం, సమ్మయ్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పద్మ, పూర్ణచందర్, వనమాల , మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ వరుణ్ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ ఆకాష్, సాయి, ఆయా పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, సీఆర్పి మహేందర్, సురేష్ , గుర్రప్ప,రవి తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక లారీల పట్టివేత...



**జమ్మికుంట, మే 21( మన వార్త ప్రతినిధి):**

జమ్మికుంట మానేరు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను పొలుసులు పట్టుకున్నారు.విలాసాగర్ గ్రామం మానేరు వాగు నుండి అక్రమంగా రెండు లారీలలో ఇసుకను తరలిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ రెడ్డ, పెట్రోలింగ్ సిబ్బంది నాగంపేట గ్రామం వద్ద లారీలను పట్టుకున్నట్లు లారిల యజమానులైన వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికీ చెందిన చందుపట్ల జితేందర్ రెడ్డి,వేములవాడ గ్రామానికి చెందిన ముద్రకోలా మహేష్ లను, డ్రైవర్లు జాన ప్రశాంత్,ఎరుకల అంజర్యు లపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రవి తెలిపారు.

# దేశాభివృద్ధిలో రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం..



**-రాజీవ్ గాంధీ కి కాంగ్రెస్ నాయకులు ఘన నివాళి..**

**జమ్మికుంట, మే 21( మన వార్త ప్రతినిధి):**

మాజి ప్రధాని రాజీవ్ గాంధీ 33 వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణశాఖ సుంకరి రమేష్ ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా లో పార్టి శ్రేణులు రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లు అర్పించారు.ఈ సంధర్బంగా నాయకులు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకురావడం వలన టెలిఫోన్ సౌకర్యం లేనటువంటి గ్రామాలు కూడా ఈరోజు ఇంటర్నెట్ సౌకర్యాలు ఏర్పడ్డాయని తెలిపారు.శాస్త్ర,సాంకేతిక రంగాల అభివృద్ధితో పాటు టెలికం,పంచాయతీరాజ్ రంగాలలో మెరుగైన సంస్కరణలు తెచ్చారని చెప్పారు.18 సంవత్సరాల యువతకు ఓటు హక్కును కల్పించిన ఘనత రాజీవ్ గాంధీ కే దక్కిందని అన్నారు.దేశాభివృద్ధిలో రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎర్రం సతీష్ రెడ్డి, వీరంనేని పరుశురాం, పర్లపెల్లి నాగరాజు, దొడ్డ సదానందం, పతాకాల అనిల్ ,పంజాల అజయ్ గౌడ్, మేస రమేష్ ,సూర్య, రమేష్, కమలాకర్, నాయిం శంకర్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు...



**సైదాపూర్ మే 21 (మన వార్త ప్రతినిధి రాజ్ కుమార్ కొరిమి)**

కరీంనగర్ జిల్లా వే.సైదాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, భారత రత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి వర్ధంతి సందర్భంగా సైదాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంత సుధాకర్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవల ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు, మరియు వివిధ గ్రామాల యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# చెట్టు మీద పడి వ్యక్తి మృతి...




**సికింద్రాబాద్ మే 21 ( మన వార్త ప్రతినిధి అంతోని )**

ప్రపంచంలో ఎవరూ గ్యారెంటీ కార్డు రాయలేదనడానికి మనం రోజూ ఓ ఉదాహరణ చూస్తూనే ఉంటాం. ఎక్కడో ఒకచోట.. మనిషి ప్రతి క్షణం మృత్యువుతో పోరాడుతున్నాడు. అనారోగ్యం బాగోలేక ఆసుపత్రికి వస్తే.. అక్కడ కూడా ప్రయాదం జరుగుతుందని ఎవరు ఊహించలేరు. అప్పటి వరకు తనతో వున్న మనిషి దూరమవుతారని గ్రహించలేరు. అయితే.. ఆరోగ్యం బాగోలేదని ఆసుపత్రికి వస్తే మరో ప్రమాదం జరిగి చనిపోతుందని ఎవరు అనుకుంటారు.. చెట్టు కొమ్మ విరిగి మీపై పడుతుందని కలలోనైనా ఊహించారా? ఈ వీడియో చూస్తే అయ్యో అనక మానరు. హైదరబాద్ లోని బొల్లారం కంటోన్మెంట్ ఆసుపత్రిలో ప్రమాదం చోటుచేసుకుంది. కంటోన్మెంట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వచ్చిన దంపతులపై ఆస్పత్రి ఆవరణలో ఉన్న భారీ వృక్షం విరిగి పడడంతో భర్త రవీందర్ అక్కడికక్కడే మృతి చెందగా అతని భార్య సరళ దేవికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి వస్తున్న క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో సరళ దేవికి సైతం తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిగా మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్ లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. సరళ దేవి ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీఋు మృతదేహాన్ని పోస్టుమార్టం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఒక్కసారితో ఈ ఘటన మూలంగా ఆసుపత్రికి వచ్చిన వారంతా ఆందోళన గురయ్యారు.

# వేములవాడలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు..



**-రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**-రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షించిన సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్**

**వేములవాడ మే 21 (మన వార్త ప్రతినిధి నందు):**

రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని తిప్పాపూర్ లో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశానికి రాజీవ్ గాంధీ ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ కుమారుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, నాయకులు చిలుక రమేష్, పీర్ మహమ్మద్, దాడి మల్లేశం, కొలకని రాజు, పులి రాంబాబు, ముప్పిడి శ్రీధర్, అక్క న పెల్లి నరేష్, నాగుల మహేష్, దుర్గం పరశు రాం గౌడ్, అరుణ్ తేజ చారీ, వస్తాదు కృష్ణ, కొక్కుల బాలకృష్ణ, నాంపల్లి శ్రీనివాస్, తాళ్లపల్లి నాగరాజు, సాబీర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న కోసం బిజెపి రణభేరి



**వేములవాడ మే 21 ( మన వార్త ప్రతినిధి)**

ఆనేక వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పట్ల నిర్లక్ష్యం వహించడాన్నీ నిరసిస్తూ బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ పిలుపు మేరకు అన్ని అసెంబ్లి కేంద్రాల్లో జరుగుతున్న రైతు దీక్ష వేములవాడ పట్టణంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో బిజెపి పార్టీ కార్యాలయంలో దీక్ష నిర్వహించడం జరిగింది ఈ దీక్షలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు రెండు లక్షల రుణమాఫీ,ఇరవైవేల రూపాయల రైతు భరోసా , పదిహేను వెలరూపాయల కౌలురతుల చేయూత,ధాన్యం ఎదైనా ఐదు వందల రూపాయలు బోనస్ చెల్లించాలి, అదేవిధంగా ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మూడు గంటలు దీక్ష నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్,కిసాన్ బిజెపి పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు, కిసాన్ మోర్చ జిల్ల అధ్యక్షులు కోల కృష్ణ స్వామి, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు సంటీ మహేష్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు నంద్యాడపు వెంకటేష్,చందుర్తి మండల అధ్యక్షులు పొంచెట్టి రాకేష్, కొనరావు పేట మండల అధ్యక్షులు గొట్టే రామచంద్రం, జిల్ల ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్,వేములవాడ నియోజకవర్గ బిజెపి కార్యకర్తలు నాయకులు పాల్గొనడం జరిగింది.

# ఉపాధి హామీ పనుల్లో ప్రమాదానికి గురైనబాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి..



**-వేములవాడ నియోజకవర్గ అధ్యక్షులు గసికంటి అరుణ్ కుమార్**

**-కోనరావుపేట మండల అధ్యక్షులు కుమ్మరి దేవదాస్**

**వేములవాడ మే 21 ( మన వార్త ప్రతినిధి)**

కొనరావుపేట్ మండలం వెంకట్రావుపేట ఉపాధి హామీ పథకం కింద రోజు వారి పనులకు వెళ్తూ దురదృష్టవశాత్తు ప్రమాదానికి గురైన కుటుంబాలను ఆదుకోవాలని బహుజన సమాజ్ పార్టీ నాయకులు నియోజకవర్గం అధ్యక్షులు అరుణ్ కుమార్ మరియు మండల అధ్యక్షులు కుమ్మరి దేవదాసు బాధిత కుటుంబాలను సిరిసిల్ల ప్రభుత్వం ఆసుపత్రిలో పరామర్శించి మాట్లాడడం జరిగింది. నిరుపేద కుటుంబాలకు చెందినా పేద బిడ్డలు ఎన్నో రోజులుగా ఉపాధి హామీ పనులు చేస్తూ అదే జీవన ఆధారంగా బ్రతుకుతున్న వారికి ఇలాంటి సంఘటన జరుగడం చాలా దురదృష్టకరం అన్నారు. కావున ప్రభుత్వం మరియు స్థానిక ఎమ్మెల్యే వీరిని వెంటనే పరామర్శించి తక్షణ సహాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మృతి చెందిన మారుపాక రాజవ్వ కు గతంలోనే భర్త చనిపోవడంతో ముగ్గురు చిన్నపిల్లలను పెంచి పోషించి ఈరోజు తను కూడా అకాల మరణం తో కుటుంబానికి దూరమవడం చాలా బాధాకరం అలాగే రాజవ్వ కుటుంబానికి 30 లక్షలు ఎగ్రేషియ ప్రభుత్వపరంగా ఇప్పించాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు అలాగే గాయపడ్డ కర్నాల లహరి.పల్లం దేవవ్వ. కర్నాల శ్యామల. ఎడ్ల రామవ్వ. వడ్నాల అమృత అలాగే సందు చంద్రయ్యకు 5 లక్షలు వైద్య ఖర్చుల నిమిత్తం వెంటనే ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు..ఉపాధి హామీ పనులు చాలా చోట్ల నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి సంఘటన లు జరుగుతూ ఉన్నాయని అధికారుల పర్యవేక్షణ లోపం వలన ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి వీటిపై వెంటనే ప్రభుత్వం దృష్టి పెట్టి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ప్రభుత్వంపై ఉందని ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ నాయకులు గుర్తు చేయడం జరిగింది.

# రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి వేడుకలు...



**సైదాపూర్ మే 21 ( మన వార్త ప్రతినిధి రాజ్ కుమార్ కొరిమి)**

సైదాపూర్ మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని సైదాపూర్ మండల గ్రామ పంచాయతీ మాజీ వార్డ్ మెంబర్ బోనగిరి అనిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ చేసిన సేవలు గుర్తు చేశారు. దేశానికి టెక్నాలజీ పరంగా చాలా అభివృద్ధి చేశారని ఆర్థిక సంస్కరణ కూడా ఒక గాడిలో పెట్టారని అన్నారు . ఈ వర్ధంతి కార్యక్రమంలో సైదాపూర్ మండల కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రజా పంపిణీ బియ్యం

## అక్రమంగా రవాణా చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవు




**– వేములవాడ రూరల్ ఎస్ ఐ మారుతీ**

**వేములవాడ మే 21 (మన వార్త ప్రతినిధి నందు):** వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామం లో అక్రమంగా తరలిస్తున్న పి డి ఎస్ బియ్యం 13 క్వింటల్ లు మరియు ఆటో ని పట్టుకొని కేసు నమోదు చేసినట్టు వేములవాడ రూరల్ ఎస్ ఐ మారుతీ తెలిపారు. వివరాలు ఎదురుగట్ల గ్రామానికి చెందిన పస్తం శ్రీనివాస్ అనే వ్యక్తి ప్రభుత్వ ప్రజా పంపిణీ బియ్యం ను అక్రమంగా సేకరించి ఎక్కువ ధరకు అమ్ముకొనుటకు తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు, ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవు అని ఎస్ ఐ మారుతీ తెలిపారు.

# నిరుపేద కుటుంబానికి దాతల సహకారంతో ఆర్థికసాయం అందజేత

**–మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్**

**వేములవాడ మే 21 ( మన వార్త ప్రతినిధి)** బొల్లారం గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన ఈసంపెల్లి పద్మ కష్టపడి సంపాదించుకున్న డబ్బులతో రేకులతో షెడ్ నిర్మించుకున్నారు. వారం క్రితం గాలివానకు రేకులు మరియు గోడ కూలి పోవడంతో ఏమిచేయలేని పరిస్థితుల్లో తోబుట్టువులా భావించి తమకు తోచిన సాయం చేయండి అని కోరడంతో మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు మరియూ ఇతర గ్రూపులలో పోస్ట్ చేయగా 12 మంది దాతలు స్పందించి 6946 రూపాయలు అందించడంతో ట్రస్టు నుండి మరికొంత కలిపి మంగళవారం రోజున ఈసంపల్లి పద్మకు 10వేల రూపాయల చెక్కు అందజేయడం జరిగిందని అలాగే ఇంకా ఎవరైనా ఆర్థిక సాయం అందించే దాతలు ట్రస్టు నం. 89855 88060 కు అందిస్తే పద్మ కుటుంబానికి అందజేయ దం జరుగుతుందని ట్రస్టు సభ్యులు తెలియజేశారు. బొల్లారం వార్డు మెంబర్ మురుగం అనిల్ మాట్లాడుతూ మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎంతోమంది పేదలకు ఆర్థిక సాయం, అన్నం దొరుకుతుందని, ట్రస్టు ద్వారా దాతల సహకారంతో నిరుపేద కుటుంబానికి చెందిన పద్మ ఇల్లు గాలివానకు కూలిపోయింది అని ట్రస్టు వారికి తెలియజేయడంతో ఈరోజు మా బొల్లారం గ్రామనికి వచ్చి



నిరుపేద కుటుంబానికి చెందిన ఈసంపల్లి పద్మ ఇల్లు కూలి పోవడంతో 10వేల ఆర్థిక సాయం అందించిన దాతలకు ట్రస్టు వారికి మా బొల్లారం తరపున ఋణపడి ఉంటామని, గతంలో కూడా హనుమాజిపేట, మల్లరం, రాజీవ్ నగర్, నిమ్మపల్లి మరియూ బాబుసాయిపేట గ్రామాల్లో కూడా ఈ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందించారని, ట్రస్టు సేవలు మరువలేనివని ట్రస్టులో ఉన్న సభ్యులందరికీ ఈ సందర్భంగా మా బొల్లారం గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తు న్నానన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, పొలాస రాజేందర్, పసూల శ్రీనివాస్ బొల్లారం గ్రామానికి చెందిన తదిగొప్పుల గోవర్ధన్, ఈసంపల్లి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# మైదా పిండి ఆరోగ్యానికి హానికరమా?



గోధుమలను పాలిష్ చేసి మరలో వేస్తే మైదా పిండి తయారవుతుంది. గోధుమలపై ఉండే పొరను తీసేస్తారు. దీంతో లోపల మృదువైన పిండి అనేది ఉంటుంది. అదే మైదా పిండి. ఈ పిండిలో అసలు ఎలాంటి పోషకాలు ఉండవు. చాలా మైదా పిండి హానికరం అని తెలీకుండా దీనిని ఎక్కువగా వాడుతూ ఉంటారు. ఎందుకంటే గోధుమ పిండి కన్నా మైదా పిండి చాలా తక్కువ ధరకే లభిస్తుంది. అందుకనే హొటల్స్‌లో ఇంకా ఇంట్లో పూరీల తయారీలో దీన్నే ఎక్కువగా వాడుతారు. అలాగే దీంతో బొండాలను కూడా వేస్తారు. ఇంకా దీంతో పాటు గారెలు, ఇడ్లీల తయారీలోనూ కొందరు మైదాను వాడుతారు. ఇలా మైదా వాడకం ఎక్కువైపోయింది. కానీ దీంతో చాలా రకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్న విషయాన్ని మాత్రం చాలా మంది ఆలోచించడం లేదు. నిజానికి ఈ మైదా పిండి అనేది ఒక వ్యర్థ పదార్థం. ఇందులో అసలు కెమికల్స్ తప్ప ఏమీ ఉండవు. అందువల్ల దీన్ని తింటే ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలగకపోగా అనారోగ్య సమస్యలు ఎక్కువగా వస్తాయి. ముఖ్యంగా క్యాన్సర్ వంటి రోగాలు వచ్చే చాన్స్ చాలా ఎక్కువగా ఉంటుంది. మైదా పిండి తయారీలో వాడే బ్రోమేట్ వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకనే బ్రోమేట్‌ను నిషేధించారు. ఇక చాలా కీటకాలు కూడా మైదాను తిన్న వెంటనే చనిపోతాయి. దానికి కారణం అందులో ఉండే కెమికల్సే. దీన్ని బట్టి మైదా ఎంత ప్రమాదకరమైనదో మీకు ఇట్టే అర్థమవుతుంది. ఇక మైదా పిండితో నీళ్లు కలిపి పోస్టర్లు అంటించేందుకు తప్ప అది ఎందుకూ పనికిరాదు. దీంతో చాలా మంది రవ్వ దోశలు, పరోటా, రుమాలీ రోటీ, కేకులు, కాజా, జిలేబీ, హల్వా వంటి అనేక స్వీట్లు చేస్తారు. కనుక ఇకపై మైదా పిండి వాడకండి. మైదా పిండిని తింటే ఎలాంటి పోషకాలు లభించవు. పైగా అనారోగ్య సమస్యలు వస్తాయి. ఇక మైదా పిండిని తెల్లగా చేసేందుకు దానికి అజోడికార్బోనోమైడ్, క్లోరిన్ గ్యాస్, బెంజోల్ పెరాక్సైడ్ వంటి రసాయనాలను కలుపుతారు. చివర్లో పొటాషియం బ్రోమేట్‌ను కలుపుతారు. దీంతో మైదా పిండి చాలా తెల్లగా, మెత్తగా, మృదువుగా తయారవుతుంది.

# అనారోగ్య సమస్యలకు తిండే కారణం..



ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ఎవరూ ఆరోగ్యంపై పెద్దగా శ్రద్ధ పెట్టడం లేదు. కొందరు వర్క్ బిజీలో పడి, మరికొందరు అతి బద్దకం మూలంగా సరైన ఫుడ్ కూడా తీసుకోవడం లేదు. మెజార్టీ పీపుల్ ఎక్కువగా జంక్ ఫుడ్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రమాదం అని తెలిసినా తప్పక లాగించేస్తున్నారు. ఈ క్రమంలోనే అనేక అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. భారతీయుల అనారోగ్యాలకు ప్రధాన కారణం తీసుకునే నాణ్యతలేని ఆహారమే కారణమని నిపుణులు ఇప్పటికే అనేక సందర్భాల్లో చెప్పారు.. చెబుతున్నారు కూడా. తాజాగా భారతీయుల కోసం కొత్త ఆహార నియమావళిని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్) ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రజల ఆహారం, జీవనశైలిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించింది. శారీరక శ్రమ వల్ల గుండెజబ్బులు, బీపీ ముప్పు భారీగా తగ్గడంతో పాటు షుగర్ కూడా కంట్రోల్ ఉండటమే కాకుండా 80 శాతం వరకు తగ్గుతుందని తెలిపింది. అకాల మరణాల ముప్పునూ తగ్గిస్తుందని పేర్కొంది. వంటల్లో నూనెల వినియోగాన్ని తగ్గించాలని, నూనెగింజలు, నట్స్, సీఫుడ్ ద్వారా శరీరానికి అవసరమైన ఫ్యాటీ యాసిడ్స్‌ను పొందాలని సూచించింది. నాణ్యతలేని ఫుడ్ తీసుకోవడం వల్ల విపరీతంగా పొట్ట పెరగటం, ఆయాసం రావడం, కంటిచూపు తగ్గడం వంటి సమస్యలు వస్తాయని హెచ్చరించింది. ముఖ్యంగా చక్కెర కలిపిన డ్రింక్స్‌కు దూరంగా ఉండాలని తెలిపింది. ఫుడ్ లిమిటెడ్‌గా తీసుకోవాలని.. ధాన్యాలు, మిల్లెట్స్,మాంసం, కూరగాయలు, పండ్లు, పాలు, నట్స్ ఎక్కువగా ఉపయోగించాలని పేర్కొంది. శరీరానికి ఇచ్చే మొత్తం క్యాలరీల్లో చక్కెర ద్వారా అందేవి 5 శాతానికి మించొద్దని, కొవ్వు ద్వారా 30 శాతానికి మించొద్దని హెచ్చరించింది. శరీరం బలంగా తయారు కావడానికి ప్రొటీన్ పౌడర్లు ఎక్కువగా తీసుకోవద్దని.. అది చాలా ప్రమాదమని పేర్కొంది. వీటి వల్ల కిడ్నీలకూ ముప్పు ఉంటుందని తెలిపింది. మన వ్యాధుల భారంలో 56 తిండే మూలం అన్నారు.

# అక్రమంగా చేరువు మట్టిని తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలి..



**–ప్రభుత్వ మట్టి ఇటుక బట్టిలకు తరలింపు..**
**–నాయకులు,గ్రామస్థులు ఫిర్యాదు.**
**–విచారణ చేపట్టిన ఎంపీడీఓ.**

**జమ్మికుంట, మే 21( మన వార్త ప్రతినిధి):** ప్రభుత్వం చేపట్టిన ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువులో నుంచి తీసిన మట్టిని రైతుల పొలాలకు తరలింపు పేరుతో రైతులకు చెందాల్సిన మట్టిని ఇటుక బట్టీలకు తరలించారు. జమ్మికుంట మండల పరిధిలోని మాచినపల్లి గ్రామంలోని గ్రామ చెరువు నుండి ఉపాధి హామీ కూలీలు తీసిన మట్టిని ఎంపిటిసి, తాజా మాజీ గ్రామ సర్పంచ్ వార్డు నెంబర్ కలసి ఇటుక బట్టీల వ్యాపారస్తులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని మాజి ఉప సర్పంచి,కాంగ్రెస్ నాయకులు,గ్రామస్తులు ఎంపీడీవో భీమేష్ కు ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించి న ఎంపీడీవో చెరువును, ఇటుక బట్టీలను పరిశీలించి విచారణ చేపట్టారు. చెరువు మట్టిని ఇటుక బట్టిల వ్యాపారస్తులకు అమ్మినట్లు నిర్ధారణ అయింది. పై అధికారులకు నివేదికను పంపించి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టి ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నారు అని తెలిపారు. ఇందులో భాగంగా చెరువులలో నుంచి తీసిన మట్టిని రైతులు తమ పట్టా పాస్ పుస్తకం పత్రాలను ఫీల్డ్ అసిస్టెంట్ కు, గ్రామ కార్యదర్శి కి అందించిన తర్వాతనే మట్టిని ట్రాక్టర్ల ద్వారా రైతు పొలాలకు తరలిస్తారు. కానీ రైతులకు సంబంధించిన ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండానే ఎంపీటీసీ ,గ్రామ సర్పంచ్ ,వార్డ్ మెంబర్ ఏకమై చెరువులో నుండి తీసిన రైతులకు చెందాల్సిన మట్టిని ఇటుక బట్టీల వ్యాపారస్తులకు విక్రయిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా గ్రామ చెరువు నుండి అక్రమంగా మట్టిని తరలించినట్లు చెప్పారు. చెరువు మట్టిని రైతుల పొలాలకు తరలించాలని నిబంధనలు వున్నా ప్రజా ప్రతినిధులు నిబంధనలను తుంగలో తొక్కి ధనార్జనే ధ్యేయంగా మట్టిని దందా నడిపిస్తూ లక్షలాది రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారని అన్నారు. వీరికి ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామ కార్యదర్శి సహకారాల అందించినట్టు ఆరోపించారు. ఊరి చెరువు మట్టిని విక్రయించినందుకుగాను ట్రాక్టర్ యజమానులను, వీరికి సహకరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోని ఇలాంటి సంఘటనను పునరాలతో కాకుండా చూడాలని అధికారులను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలోబండారి కుమార్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, దొంతరవేని రమేష్ బీజేపి గ్రామ అధ్యక్షులు, పోల్సాని సంపత్ రావు బిజేపి నాయకులు, గా%శీ%డ్ల శ్రీను బీజేపి నాయకులు,బొజ్జం రవీందర్ రెడ్డి టీ ఆర్ ఎస్ నాయకులు, పర్లపల్లి నాగరాజు కాంగ్రెసు సీనియర్ నాయకులు, కాశవెని శ్రీను రైతు తదితరులు వున్నారు.



# తామర గింజల అద్భుత ప్రయోజనాలు..!




పూల్ మఖానాను ఎక్కువగా తామర విత్తనాలని కూడా పిలుస్తూ ఉంటారు. చాలామందికి వీటి యొక్క ఆరోగ్య ప్రయోజనాలు తెలియవు ఇవి ధర ఎక్కువగా ఉన్నప్పటికీ ఆరోగ్య ప్రయోజనాలు అంతకుమించి ఉంటాయి..డయాబెటిస్, జీర్ణ వ్యవస్థలు, ఒత్తిడి వంటి ఆరోగ్య సమస్యల నుంచి కూడా బయటపడవచ్చు..పూల్ మఖానాను తీసుకోవడం వల్ల లభించే అటువంటి ఆరోగ్య ప్రయోజనాలను ఇప్పుడు ఒకసారి మనం తెలుసుకుందాం..పూల్ మఖానాను షుగర్ పేషెంట్లు తినడం వల్ల చాలా ఉపయోగం ఉంది. ఇందులో ఎక్కువగా గ్లైసి మిక్ ఇండెక్స్ కూడా కలిగే ఉంటుంది. దీని వల్ల షుగర్ పేషంట్ల రక్తంలోని సుగర్స్ లెవ్వాల్ ను కూడా పెరగకుండా అడ్డుపడతాయి. అంతేకాకుండా ఇది ఎక్కువగా జీర్ణం అవ్వడం కూడా జరుగుతుంది. రక్తంలోని హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచడంలో ఇది చాలా ఉపయోగపడుతుంది.పూల్ మఖానాను అధిక శాతం ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను కూడా మెరుగుపరచడంలో చాలా సహాయపడుతుంది.. అలాగే మలబద్ధకం అజీర్ణం అసిడిటీ వంటి సమస్యలను కూడా తగ్గిస్తుంది. శరీరంలో ఉండే వాపు నొప్పిని కూడా తగ్గించేలా చేస్తాయి. గుండె జబ్బులు ఇతరత్న దీర్ఘకాలిక వ్యాధులను కూడా తగ్గించడానికి ఉపయోగపడుతుంది. పూల్ మఖానాను ఇన్సులిన్ నిరోధకను కూడా తగ్గిస్తుంది. అలాగే సంతాన ఉత్పత్తికి కూడా సహాయపడుతుంది. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును సైతం తగ్గించడానికి ఉపయోగపడుతుంది. ఈ తామర గింజలలో క్యాలరీలు తక్కువగా ఉండటం వల్ల ఎక్కువగా కడుపు నిండినట్టుగా అనిపిస్తుంది దీనివల్ల బరువు కూడా తగ్గ అవకాశం ఎక్కువగా ఉంటుంది. పూల్ మఖానాను ప్రోటీన్, ఫైబర్ ,ఐరన్ ,మెగ్నీషియం వంటివి పుష్కలంగా లభిస్తాయి.. వీటిని కనీసం 20 నిమిషాలు నానబెట్టి.. ఫ్రై కాని కూర కాని చేసుకొని తినవచ్చు. అయితే ఇందులోకి నిమ్మరసం కొత్తిమీర కలుపు తినడం వల్ల మరింత లాభాలు ఉంటాయి.పూల్ మఖానాను మార్కెట్లో ఎక్కడైనా సరే ఇవి దొరుకుతాయి

# స్ట్రాబెర్రిలతో అధిక బరువుకు చెక్..




స్ట్రాబెర్రిల గురించి అందరికీ తెలుసు.. తియ్యగా, పుల్లగా ఉండటం వల్ల పిల్లలు కూడా వీటిని ఇష్టంగా తింటారు.. స్ట్రాబెర్రీ పండ్లలో పోషకాలు అనేకం ఉన్నాయి.వీటిని పిల్లలు, పెద్దలు ఇష్టంగా తింటారు. దీని వలన చాలా ప్రయోజనాలు ఉన్నాయి.స్ట్రాబెర్రీలో ఉండే రుచి, పోషక విలువల కారణంగా ఈ పండ్లను అనేక రకాలుగా వాడుతారు. అందుకే మార్కెట్ లో వీటికి డిమాండ్ కూడా ఎక్కువగానే ఉంటుంది..వీటిని రోజు తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. పొటాషియం, విటమిన్ కే మరియు మెగ్నీషియం కలిసి ఉండటం వలన ఎముకల పటిష్టతకు స్ట్రాబెర్రీస్ బాగా ఉపయోగపడతాయి. అలాగే వీటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది బరువు తగ్గడానికి ఉపయోగ పడుతుంది.. అధిక బరువుతో భాధ పడేవారు వీటిని ఎక్కువగా తీసుకోవచ్చు.. వీటిలో క్యాలరీలు కూడా తక్కువే.. అజీర్ణం, గ్యాస్, మలబద్దకం, అసిడిటీ తదితర సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. శరీరంలోని వ్యర్థ పదార్థాలు బయటకు వెళ్లిపోతాయి.బరువును నియంత్రించే హార్మోన్ల పని తీరును మెరుగు పరుస్తుంది.. స్ట్రాబెర్రీలలో ఆంథోసయనిన్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి అడిపోనెక్టిన్ అనబడే హార్మోన్‌ను ఉత్పత్తి చేస్తాయి.. ఇది శరీరంలోని మెటబాలిజం ను నియంత్రిస్తుంది.. దానివల్ల సులువుగా బరువును తగ్గవచ్చు..

# నాగార్జునతో మరోసారి రెడీ అయిన డైరెక్టర్



అక్కినేని ఫ్యామిలీ నుంచి ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన నాగార్జున మొదట్లో హీరోగా అంతగా సక్సెస్ సాధించనప్పటికి శివ సినిమాతో ఒక్కసారిగా ఆయన ఓవర్ నైట్ లో స్టార్ హీరోగా మారిపోయాడు.ఇక ఇప్పటివరకు వరుసగా సినిమాలు చేస్తూ ముందుకు సాగుతున్నాడు. ఆయన చేసిన ప్రతి సినిమా కూడా ప్రస్తుతం ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలను పెంచేస్తున్నాయి. ఇక ఇదిలా ఉంటే ఇప్పటికే పూరిజగన్నాథ్ డైరెక్షన్ లో నాగార్జున రెండు సినిమాలను చేశాడు. అందులో 'సూపర్ ' సినిమా ఫ్లాప్ అవ్వగా, 'శివమణి ' సినిమా మంచి విజయాన్ని అందుకుంది.ఇక ముచ్చటగా మూడోసారి పూరి నాగార్జునతో సినిమా చేయాలనే ఆలోచనలో ఉన్నట్టుగా తెలుస్తుంది. ఇక ప్రస్తుతానికి పూరి వరుస సినిమాలు చేస్తూ చాలా బిజీగా గడుపుతున్నాడు అయినప్పటికీ తన తర్వాత సినిమాను నాగార్జునతో చేయాలనే ప్లానింగ్ లో ఉన్నట్టుగా వార్తలైతే వస్తున్నాయి. ఇక పూరి ఒక సినిమా చేస్తున్నాడంటే ఆ సినిమా మీద ప్రేక్షకుల్లో మంచి అంచనాలైతే ఉంటాయి. ఇక నాగార్జునకి కూడా పూరి వర్కింగ్ స్టైల్ అంటే చాలా ఇష్టం. అందుకే పూరి డైరెక్షన్ లో ఇంతకు ముందే రెండు సినిమాల్లో నటించి మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. ఇక పర్సనల్ గా కూడా పూరి అంటే నాగార్జునకి ఇష్టమని ఆయన చాలాసార్లు చెప్పారు. ఇక ఇదిలా ఉంటే పూరి చేస్తున్న డబుల్ ఇస్మార్ట్ సినిమా సక్సెస్ అయితే నాగార్జునతో సినిమా చేస్తాడు. లేకపోతే మాత్రం నాగార్జున అవకాశం ఇస్తాడా లేదా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఇక నిజానికి అయితే పూరి జగన్నాథ్ అనుకుంటే నాగార్జున ఈజీగా డేట్స్ అయితే ఇస్తాడు. కానీ సక్సెస్ తో నాగార్జున దగ్గరికి వెళ్తే బాగుంటుందనే ఉద్దేశ్యంలోనే పూరి ఆలోచిస్తున్నట్టుగా తెలుస్తుంది. ఇక ఇస్మార్ట్ శంకర్ కి సీక్వెల్ గా వస్తున్న డబుల్ ఇస్మార్ట్ సినిమాకు సంబంధించిన టీజర్ ని రీసెంట్ గా రిలీజ్ చేశారు.

# అందం కోసం చందమామ సాహసం?



హీరోయిన్ కి కావాల్సిన మొదటి క్వాలిటీ చక్కని రూపం. దర్శక నిర్మాతల కంట్లో పడాలన్నా, ప్రేక్షకులు మెచ్చాలన్నా ఒడ్డు పొడుగు ఉండాలి.సహజంగా వచ్చిన అందాలకు కొందరు ఆర్టిఫిషియల్ మెరుగులు దిద్దుతూ ఉంటారు. శ్రీదేవితో పాటు పలువురు హీరోయిన్స్ సర్జరీ చేయించుకున్నారనే వాదన ఉంది. తాజాగా కాజల్ అగర్వాల్ సర్జరీ చేయించుకున్నారంటూ పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. ఈ సంగతి ఏమిటో చూద్దాం.. కాజల్ అగర్వాల్ చందమామలా ఉంటుంది. ఆమె గ్లామర్ కి పేరు పెట్టడానికి లేదు. అయితే వివాహం అనంతరం ఆమెకు ఓ సమస్య వచ్చిందట. కాజల్ పెదాలు నల్లగా తయారయ్యాయట. దాంతో ఆమె సర్జరీ చేయించుకోవాలని నిర్ణయించుకున్నారట. గులాబీ రంగుతో రొమాంటిక్ గా ఉండేలా తన రెండు పెదాలను సర్జరీతో మార్చేసిందఅనే టాక్ మొదలైంది. ఈ మేరకు ఓ న్యూస్ చక్కర్లు కొడుతుంది. సత్యభామ చిత్ర ప్రమోషన్స్ లో పాల్గొంటున్న కాజల్ పెదాలు చూస్తే ఈ డౌట్ రాకమానదు. ఆమె లుక్ కూడా కొంచెం డిఫరెంట్ గా ఉంది. పెదాలకు సర్జరీ చేయించడం వలనే కాజల్ ముఖంలో మార్పు కనిపిస్తుందని సోషల్ మీడియాలో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అయితే కాజల్ సర్జరీ చేయించుకున్నట్లు ఎలాంటి ఆధారాలు లేవు. అలాగే అధికారిక సమాచారం కూడా లేదు. ఇది కేవలం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న న్యూస్. ఇక సత్యభామ మూవీ మే 31న విడుదల చేస్తున్నారు. ఈ లేడీ ఓరియెంటెడ్ మూవీలో కాజల్ ఐఏఎస్ అధికారిణి పాత్ర చేస్తుంది. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ గా ఆమె సత్తా చాటనుంది. నవీన్ చంద్ర మరొక కీలక రోల్ చేస్తున్నాడు. సత్యభామ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకుడు. మరోవైపు కాజల్ పెళ్లి తర్వాత కూడా సత్తాచాటుతుంది. 2020లో మిత్రుడు గౌతమ్ కిచ్లును కాజల్ పెళ్లి చేసుకుంది. వీరికి ఒక అబ్బాయి సంతానం.

# టీ-20 వరల్డ్ కప్ ప్రారంభం కాకముందే టీమ్ ఇండియాకు కోలుకోలేని దెబ్బ..




దేశవ్యాప్తంగా ఐపీఎల్ మేనియా ఇంకా తగ్గలేదు. లీగ్ సమరం ముగిసింది. రేపటి నుంచి ప్లే ఆఫ్ పోరు ప్రారంభం కానుంది. హైదరాబాద్, కోల్ కతా, బెంగళూరు, రాజస్థాన్ ప్లే ఆఫ్ కు వెళ్లిపోయాయి. మొదటి రెండు స్థానాలలో నిలిచిన కోల్ కతా, హైదరాబాద్ జట్ల మధ్య రేపు ప్లే ఆఫ్ మ్యాచ్ జరగనుంది.. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియం ఇందుకు వేదిక కానుంది.. మే 22న రాజస్థాన్, బెంగళూరు ఎలిమినేటర్ మ్యాచ్ లో తలపడతాయి. ఇది ఇలా ఉండగానే టీ -20 వరల్డ్ కప్ కు సంబంధించిన ఏదో ఒక అప్డేట్ అభిమానులకు ఆసక్తిని కలగజేస్తోంది. జూన్ రెండు నుంచి అమెరికా, వెస్టిండీస్ వేదికలుగా టీ -20 వరల్డ్ కప్ ప్రారంభం కానుంది. ఇప్పటికే రోహిత్ ఆధ్వర్యంలో టీం ను బీసీసీఐ ప్రకటించింది. అయితే ఈ టోర్నీ ప్రారంభం కాకముందే టీమిండియా కు చేదు గుళిక తగిలింది.టి20 వరల్డ్ కప్ లో భాగంగా జూన్ 1న టీమిండియా బంగ్లాదేశ్ జట్టుతో వార్మప్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ కంటే కొద్దిరోజుల ముందే రోహిత్ శర్మ, హార్థిక్ పాండ్యా, బుమ్రా అమెరికా వెళ్ళనున్నారు. అయితే సంజు సాంసన్, యశస్వి జైస్వాల్, యజువేంద్ర చాహల్, విరాట్ కోహ్లీ, మహమ్మద్ సిరాజ్ వంటి వారు వార్మప్ మ్యాచ్ కు దూరం కానున్నారు. టీమిండియా జూన్ 5 న టోర్నీలో మొదటి మ్యాచ్ ఐర్లాండ్ జట్టుతో ఆడుతుంది. అంతకుముందు బంగ్లాదేశ్ జట్టుతో వార్మప్ మ్యాచ్ ఆడుతుంది. టి20 వరల్డ్ కప్ లాంటి మెగా టోర్నీలలో రాణించాలంటే ఆటగాళ్లకు వార్మప్ మ్యాచ్ లు ఎంతో ఉపకరిస్తాయి. అయితే ఐపీఎల్ ప్లే ఆఫ్ మ్యాచ్ లు ఆడే ఆటగాళ్లకు ఆ అవకాశం లేదు. టి20 వరల్డ్ కప్ ఆడేందుకు మే 25న అర్ధరాత్రి మన దేశానికి చెందిన ఆటగాళ్ల బృందం అమెరికా చేరుకుంటుంది. లీగ్ దశలో బయటికి వచ్చిన ముంబై ఆటగాళ్లు రోహిత్ శర్మ, బుమ్రా, హార్దిక్ పాండ్యా, సూర్య కుమార్ యాదవ్ మొదటి బ్యాచ్ లో వెళ్తారు. రెండో బ్యాచ్ లో ఆటగాళ్లు మే 28న అమెరికా చేరుకుంటారు.. ఒకవేళ బెంగళూరు ఫైనల్ వెళ్తే విరాట్ కోహ్లీ, సిరాజ్ మే 27 అర్ధరాత్రి అమెరికా బయలుదేరి వెళ్తారు. ఒకవేళ బెంగళూరు ఎలిమినేటర్ మ్యాచ్లో ఓడిపోతే టి20 ప్రపంచ కప్ కోసం మే 25న అమెరికా వెళ్లే మొదటి విమానంలో రోహిత్, సూర్య కుమార్ యాదవ్, బుమ్రా, రాహుల్ ద్రావిడ్ తో పాటు విరాట్ కోహ్లీ, సిరాజ్ ప్రయాణిస్తారు.. ఒకవేళ విరాట్ కోహ్లీ, మహమ్మద్ సిరాజ్ మే 29న అమెరికా వెళ్తే.. వార్మప్ మ్యాచ్ కు ముందు వారికి రెండు రోజులపాటు విశ్రాంతి లభిస్తుంది. టి20 ప్రపంచ కప్ లో జూన్ 5న ఐర్లాండ్ జట్టుతో ఆడే మ్యాచ్ కు ముందు టీమిండియా మేనేజ్మెంట్ ఇద్దరి ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే భారత్, న్యూయార్క్ కు కాలమానంలో 9.50 గంటల వ్యత్యాసం ఉంటుంది. అలాంటప్పుడు అక్కడి పరిస్థితులకు ఆటగాళ్లు అలవాటు పడటం ఒకింత కష్టమే. ఇక రాజస్థాన్ జట్టు ఐపిఎల్ ఫైనల్ చేరుకుంటే సంజు, యజువేంద్ర చాహల్, యశస్వి జైస్వాల్ కూడా వార్మప్ మ్యాచ్ ఆడే అవకాశం ఉండదు. మే 22న జరిగే ఎలిమినేటర్ మ్యాచ్ లో రాజస్థాన్, బెంగళూరు తలపడతాయి.

# దేవరకొండతో సుకుమార్ మూవీ.!



కొంతమంది దర్శకులు మూస ధోరణిలో సినిమాలు చేస్తూ ఒకే ఫార్ములాని ఫాలో అవుతూ రొటీన్ సినిమాలు చేస్తూ ఉంటారు. కానీ కొంతమంది మాత్రం వైవిధ్యభరితమైన కథాంశాలను ఎంచుకుంటూ ఉంటారు. ఇక అందులో సుకుమార్ ఒకరు. ఈయన చేసిన ఆర్య సినిమా నుంచి ఇప్పుడు చేస్తున్న పుష్ప 2 సినిమా వరకు ప్రతి సినిమాలో కూడా ఏదో ఒక కొత్త ఎలిమెంట్ అయితే ఉంటుంది. అది లేకపోతే సుకుమార్ సినిమానే చేయడు. ఇక ఇదిలా ఉంటే 2020 వ సంవత్సరంలో సుకుమార్ విజయ్ దేవరకొండ కాంబినేషన్ లో ఒక సినిమా రాబోతుందంటూ ఒక బిగ్ అనౌన్స్ మెంట్ అయితే వచ్చింది. మరి ఆ అనౌన్స్ మెంట్ వచ్చిన తర్వాత నుంచి ఇప్పటి వరకు అయితే ఆ సినిమా మీద ఎలాంటి అప్డేట్ అయితే ఇవ్వడం లేదు. ఇక కొందరైతే ఆ సినిమా ఆగిపోయింది అని చెప్తుంటే మరికొందరు మాత్రం ఈ సినిమా తొందర్లోనే స్టార్ట్ అవ్వబోతుందనే కథనాలను కూడా వెలువరిస్తున్నారు. మరి ఇలాంటి క్రమంలో మరోసారి వీళ్ళ కాంబినేషన్ లో సినిమా రాబోతుందనే వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతుంది. నిజానికి సుకుమార్ లాంటి స్టార్ డైరెక్టర్ విజయ్ దేవరకొండ లాంటి టైర్ టు హీరోతో సినిమా చేస్తున్నాడు అంటే నిజానికి విజయ్ అదృష్టమనే చెప్పాలి.అయితే ఈ సినిమా సెట్స్ మీదకి ఎప్పుడు వెళ్తుంది అనే వార్తలైతే ఏమి తెలియడం లేదు. కానీ మొత్తానికైతే వీళ్ళ కాంబినేషన్ లో సినిమా ఈ రెండు సంవత్సరాలలో స్టార్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయంటూ ఇటు సుకుమార్ సన్నిహితుల నుంచి గాని, విజయ్ స్నేహితుల నుంచి గాని వార్తలైతే వస్తున్నట్టుగా తెలుస్తుంది.

# గేమ్ చేంజర్ పరిస్థితి ఏంటి..?




తమిళ్ సినిమా ఇండస్ట్రీలో వరుసగా సూపర్ హిట్లను దక్కించుకున్న ఏకైక దర్శకుడు శంకర్.. ఇక తమిళం లో మణిరత్నం స్టార్ డైరెక్టర్ గా కొనసాగుతున్న సమయంలో శంకర్ సినిమా ఇండస్ట్రీకి వచ్చి తమిళంలో నెంబర్ వన్ డైరెక్టర్గా ఎదిగాడు. ఇక ఇలాంటి క్రమంలోనే ఆయనకు సక్సెస్ రేట్ కూడా చాలా ఎక్కువగా ఉండేది. ఆయన చేసిన సినిమాలు దాదాపు అన్ని కూడా తమిళ్ తెలుగులో సక్సెస్ లను సాధించాయి. ఇక ఇది ఇలా ఉంటే ప్రస్తుతం ఆయన భారతీయుడు 2 అనే సినిమాను చేస్తున్న విషయం మనకు తెలిసిందే...అయితే ఈ సినిమా లో ఉన్నప్పుడే కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ సినిమా ఆగిపోయింది. ఇక దాంతో శంకర్ రామ్ చరణ్ తో గేమ్ చేంజర్ అనే సినిమాను స్టార్ట్ చేశాడు. ఇక ఈ సినిమా ఒక్క షెడ్యూల్ ముగిసిన తర్వాత మళ్లీ భారతీయుడు 2 సినిమాని స్టార్ట్ చేశారు. ఇక దానివల్లే ఆయన గేమ్ చేంజర్ సినిమాకి బ్రేక్ ఇచ్చి భారతీయుడు 2 సినిమా తీయాల్సిన అవసరం అయితే వచ్చింది. ఇక ఇదిలా ఉంటే ప్రస్తుతం ఈ సినిమాని జూన్ 12వ తేదీన రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లుగా తెలుస్తుంది. మరి ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు బాగానే ఉంది. మరి రామ్ చరణ్ హీరోగా వస్తున్న గేమ్ చేంజర్ సినిమా పరిస్థితి ఏంటి ఆ సినిమాను ఎప్పుడు రిలీజ్ చేయబోతున్నారు అంటూ సోషల్ మీడియా వేదికగా శంకర్ ను ప్రశ్నిస్తున్నారు. ఇక మొత్తానికైతే ఆయన గేమ్ చేంజర్ సినిమాకి సంబంధించిన ఒక అప్డేట్ ని కూడా సరిగా ఇవ్వడం లేదు. దానివల్లే ఆయన మీద చాలామంది అభిమానులకు తీవ్రమైన నిరాశ అయితే ఉంది. ఇక దాంతోనే ఇప్పుడు భారతీయుడు 2 సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు.

# భిన్న కథాకథనాలతో తథాస్తు



భిన్న కథాకథనాలతో తథాస్తుకన్నా నాగరాజు సమర్పణలో హెచ్.ఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై రామ్ తేజ్, వర్షిని, మౌనిక హీరో, హీరోయిన్లుగా తోట వెంకట నాగేశ్వరరావు స్వీయ నిర్మాణ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మల్లె మొగ్గ'. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి ఆదరణ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో సినిమా సక్సెస్ మీట్ను ప్రసాద్ ల్యాబ్స్లో నిర్వహించడంతో పాటు రామ్ తేజ్ హీరోగా ఈ సంస్థ నిర్మిస్తున్న కొత్త సినిమా 'తథాస్తు' పోస్టర్ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చంద్రమహేశ్, నిర్మాత దామోదర ప్రసాద్ తదితరులు చిత్రబృందాన్ని అభినందించారు. నిర్మాత బాలాజీ నాగలింగం మాట్లాడుతూ, 'దామోదర ప్రసాద్ తండ్రి సినిమాలు చేసేప్పుడు వారి సంస్థలో పనిచేశాను. సినిమా ఇండిస్ట్రీ మీద ప్యాషన్తో ఎన్నో ఏళ్లుగా పరిశ్రమలోనే ఉన్నాం. నిర్మాతగా ఇకపైనా చిత్ర పరిశ్రమలో కొనసాగాలని ఆశిస్తున్నాను' అని అన్నారు. 'తోట వెంకట నాగేశ్వరరావు చెప్పిన కథ నాకు బాగా నచ్చి ఈ ప్రాజెక్ట్లోకి సహ నిర్మాతగా జాయిన్ అయ్యాను. బీ, సీ సెంటర్స్లో మా 'మల్లె మొగ్గ' సినిమా మంచి ఆదరణ పొందుతోంది. మా దగ్గరలోని థియేటర్స్లో మహిళా ప్రేక్షకులకు చీరలు పంచిపెట్టాం. ప్రతి మహిళ చూడాల్సిన సినిమా ఇది. 'మల్లె మొగ్గ' సినిమా మరింత సక్సెస్ కావాలని కోరుకుంటున్నా' అని సహ నిర్మాత కన్నా నాగరాజు చెప్పారు. హీరో రామ్ తేజ్ మాట్లాడుతూ, 'నన్ను హీరోగా చేసిన మా మామయ్య, మా డైరెక్టర్ తోట వెంకట నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు. '

# కోల్కతాను పడగొట్టాలంటే..




లీగ్ దశలో అద్భుతమైన విజయాలను అందుకొని సన్ రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్ లోకి అడుగుపెట్టింది. లీగ్ దశలో చివరి మ్యాచ్ పంజాబ్ జట్టుతో ఆడి గెలుపును దక్కించుకుంది. దానికి తోడు రాజస్థాన్, కోల్ కతా మ్యాచ్ వర్షం వల్ల రద్దు కావడంతో పాయింట్ల పట్టికలో రెండవ స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ఈ క్రమంలో మంగళవారం గుజరాత్ లోని అహ్మదాబాద్ నగరంలో నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా కోల్ కతా జట్టుతో ప్లే ఆఫ్ మ్యాచ్ ఆడనుంది. సాయంత్రం 7:30 నుంచి ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. రెండు జట్ల బలాలు సమానంగా ఉన్నప్పటికీ.. గత చరిత్ర చూస్తే.. హైదరాబాద్ పై కోల్ కతా జట్టు దే పై చేయి. దానికి ఫుల్ స్టాప్ పెట్టాలంటే కచ్చితంగా హైదరాబాద్ కొత్త రకమైన ఆట తీరు ప్రదర్శించాలి. ముఖ్యంగా ఆ జట్టు ఆటగాళ్లు తమ ఆట తీరును పూర్తిగా మార్చుకోవాలి.. బలమైన కోల్ కతా ను మట్టి కరిపించాలంటే.. హైదరాబాద్ ఆటగాళ్లు ఆకాశమే హద్దుగా చెలరేగాలి.. ఈ సీజన్లో హైదరాబాద్ ఆటగాళ్లు బెంగళూరుపై 287/3, ముంబై పై 277/3 పరుగులు చేసి ఐపిఎల్ లో సరికొత్త రికార్డులు సృష్టించారు. ఇదే క్రమంలో అహ్మదాబాద్ వేదికపై గుజరాత్ జట్టు తో జరిగిన మ్యాచ్లో 162 పరుగులకే పరిమితమయ్యారు.. అహ్మదాబాద్ మైదానం అటు పేస్, ఇటు బౌన్స్ కు సహకరిస్తుంది. అలాగని దూకుడుగా ఆడకూడదని కాదు. టాస్ గెలిస్తే రెండవ మాటకు తావు లేకుండా బ్యాటింగ్ ఎంచుకుంటేనే ప్రయోజనం ఉంటుంది. ఎందుకంటే చేజ్ సమయంలో ఈ ప్రాంతంలో మంచు కురుస్తుంది. అప్పుడు బంతి బౌన్స్ అయ్యేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల బ్యాటర్లకు పరుగులు తీయడం కష్టమైపోతుంది.. గత మ్యాచ్లో హైదరాబాద్ ఓపెనర్ హెడ్ తాను ఎదుర్కొన్న తొలి బంతికే క్లీన్ బౌల్డ్ అయ్యాడు. అలాంటి తప్పును ఈ మ్యాచ్లో పునరావృతం చేయకూడదు. పంజాబ్ జట్టు కాబట్టి సరిపోయింది. కోల్ కతా లాంటి జట్టు ముందు అలాంటి పప్పులు ఉడకవు. అభిషేక్ శర్మ, మార్క్రం, క్లాసెన్, నితీష్ రెడ్డి వంటి వారి మీద హైదరాబాద్ బ్యాటింగ్ ఆధారపడుకుంటూ వస్తోంది. సెమీఫైనల్ లో ఇలాంటి వాటికి హైదరాబాద్ ఆటగాళ్లు స్వస్తి పలకాలి. మిగతా ఆటగాళ్లు కూడా తమ వంతు భారాన్ని మోయాలి. అబ్దుల్ సమద్, కమిన్స్ వంటి వారు ధాటి ఇన్నింగ్స్ ఆడాల్సి ఉంది. బౌలింగ్లో భువనేశ్వర్, కుమార్ నటరాజన్, కమిన్స్ అద్భుతాలు చేస్తున్నారు. స్లో బంతులు వేస్తూనే వికెట్లు తీస్తున్నారు. పేస్ పరంగా హైదరాబాద్ జట్టుకు తిరుగులేదు. అయితే ఇదే సమయంలో స్పిన్ బౌలింగ్ లో హైదరాబాద్ జట్టు తేలిపోతుంది.. ఈ జట్టులో నాణ్యమైన స్పిన్నర్లు లేకపోవడంతో మధ్య ఓవర్లలో హైదరాబాద్ జట్టు ఒత్తిడి ఎదుర్కొంటోంది.. ఇలాంటి క్రమంలో స్పిన్ బౌలర్లు తమ అంచనాలకు మించి రాణించాల్సి ఉంది. అప్పుడే కోల్ కతా ను కట్టడి చేసేందుకు అవకాశం ఉంటుంది. నితీష్ రెడ్డి లాంటి బౌలర్లు ధారాళంగా పరుగులు ఇస్తున్నారు.. అలాంటివారు లైన్ అండ్ లెన్త్ ను పాటించి, వైవిధ్యమైన బంతులు వేస్తేనే ప్రయోజనం ఉంటుంది.